# జీరో డాట్ జీరో జీరో

కవనశర్మ

**శకుంతలకి నిర్వాకం మీద మోజెక్కువ. ఆమె మేనల్లుడు సుధాకర్ బికాం. ఆపైన సి.ఎ పాసైనప్పటినుంచి శకుంతల అతని ద్వారా ఆమె భర్త అయిన శేషగిరి చేత నిర్వాకం చేయించే ప్రయత్నంలో పడ్డది. షేరు మార్కెట్లున్నదే లాభాలని ప్రజలతో షేర్ చెయ్యడానికి అని మేనత్తకి సుధాకర్ మారిపోసాడు. అప్పుచెయ్యనివాడు అమెరికాలో కానుకు చెల్లడని, అమెరికా అంత గొప్ప దేశం అవడానికి కారణం ప్రజలందరూ అప్పుచేసి కావలసిన పనులు చేసుకుపోవడమేనని సవాలక్ష విదర్శనాలు చూపించాడు.**

శేషగిరి నిలబడి నీళ్ల తాగేరకం. ముందు ఆదాచేసి ఆపైన అవసరమైన ఖర్చు చేయాలని నమ్మే రకం. తండ్రి ఇచ్చిన ఇంటికి మేడ వేసుకున్నాడు. మేడమీద వెన్నెల రాత్రుళ్లు, మల్లెల మాసాలు చంద్రుడిని చూస్తూ, చల్ల గాలిననుభవిస్తూ గడిపారు. కూతుళ్ల పెళ్లికెదిగి వచ్చినప్పుడు అతని పి.ఎఫ్, ఎల్.ఐ.సిలు అతన్ని కాపాడాయి. అతనికే సమస్యలు లేవనుకుంటున్న సమయంలో పింఛెన్ పుచ్చుకోవడానికి పది సంవత్సరాల సమయం ఉండగా సమస్య, బావమరిది కొడుకు సుధాకర్ రూపంలో ప్రత్యక్షమైంది. అతను ఓ ఫైనాన్స్‌కంపెనీలో పనిచేస్తున్నాడు.

"మావయ్యా! మీరు క్రెడిట్‌కార్డు వర్డీ తెలుసా?"

"నేను మంచి మేస్టర్నన్న క్రెడిట్ నాకుంది. నాకు తెల్సు"అన్నాడు శేషగిరి.

"అదికాదు మావయ్యా! ఈ రోజున మీరో లక్ష రూపాయలు అప్పుచేయదలచుకుంటే కళ్ల కద్దుకుని అప్పిచ్చే ఫైనాన్స్ కంపెనీలు బోలెడు.." అని వివరించాడు.

'చేయదల్చుకుంటే కదా! అమ్మయ్య! నేను చేయదల్చుకోలేదు"అని తన పాలిసీ ప్రకటించి ఊపిరిపీల్చుకున్నాడు శేషగిరి.

సుధాకర్ పట్టిన పట్టు విడువడు. శకుంతల దగ్గరకు వెళ్లి "అత్తా ఎన్నాళ్లని మీరు ఆ పాత ఫియెట్ కారుతో బాధపడ్తారు? ఓ మారుతీ కొనుక్కోరాదూ!" అని ఆమె ఏమరుపాటుగా ఉన్నప్పుడు సలహా ఇచ్చాడు. అది అంతశ్చేతనలో ఎక్కడో గుచ్చుకునేలా.

"మా దగ్గర కొత్త మారుతీ కొనే డబ్బెక్కడుందిరా సుధా?"అంది శకుంతల ఉంటే కొనేయడానికి సిద్ధమే అన్న ధోరణిలో. లేదన్న కొద్ది దిగులుతో.



అప్పుడు సుధాకరే ఫైనాన్స్‌కంపెనీలు, అప్పులు, ప్రగతి, అమెరికా, అంటూ ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చి అత్తని ఒప్పించాడు.

శేషగిరి కాలేజీలో విద్యార్థుల దగ్గర చాలా స్ట్రిక్ట్ కానీ జీవితంలో భార్య దగ్గర, చాలా బలహీనుడు. శకుంతల ముక్కు ఎగబీల్చుడు లోనూ, అయినవారందరినీ వదులుకొని భర్తే అన్నింటికి ఉన్నాడని తను నమ్మివచ్చిందని చెప్పడంలోను, శేషగిరికి తన పై ప్రేమలేదంటూ ఇమోషనల్ బ్లాక్‌మెయిల్ చెయ్యడంలోనూ నోరు తిరిగిన మనిషి. ఈ మధ్య శేషగిరికి వినపడేలా పూజా సమయంలో దేవుడితో కోర్కెలు చెప్పుకోవడం కూడా నేర్చుకుంది.

కొండలాంటి శేషగిరి శకుంతల అలకల అలలకి చలించి, కరిగి మారుతీకారు కొనడానికి సిద్ధపడ్డాడు. వెంటనే కారు కొనెయ్యడం, ఆపైన నెమ్మదినెమ్మదిగా అప్పుతీర్చడం కూడా పూర్తయిపోవచ్చింది.

శేషగిరి అల్లుళ్లిద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అవడంలో,హార్డుడిస్కులు, సి.డి.రామ్‌లు, డ్రైవులు, బిట్ బై బిట్ల అతని జీవితాన్ని బైట్ చేయడం మొదలుపెట్టాయి. శకుంతలకి మోడర్న్ టెక్నాలజీ అన్నా మొగుడు మోడర్న్‌గా ఉండటం అన్నా మోజు. జీనుపాంట్లు, టీషర్టులు ధరించగలిగిన శేషగిరి ఆటోమేషన్‌ని భరించలేకపోయాడు. కాని ఈ దేశంలో అరచెయ్యి అడ్డం పెట్టి సూర్యోదయం ఆపలేం కదా! మోకాలడ్డి ప్రగతినీ ఆపలేం. దేశం అంతటా కంప్యూటరైజేషన్ హోరెత్తిపోతోంది. కిళ్లీకొట్టు కిష్టయ్యలూ, పాలుపోసే పాపాయమ్మలూ క్రాష్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీలు, బాంకులు అందరు కంప్యూటర్లు కొనేసుకుని స్టాఫ్‌ని ట్రెయిన్ చేయించేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ అమ్మినవారు కొన్ని చోట్ల మాన్యువల్ ఓవర్ రైడ్స్ చెప్పటం మర్చిపోయారు. చెప్పిన చోట్ల అవి పెద్దాఫీసుల

నుంచి కింద ఆఫీసులకి ఇంక లేదు. కాని ఆటోమేషన్‌ని అందరు ఆటోమేటిక్‌గా ఒప్పేసుకుని అమలు జరుపిస్తున్న శుభ సమయంలో శేషగిరి బాకీ తీరిపోయింది. ఆ విషయం తెలియజేస్తున్నట్లుగా ఫైనాన్స్ కంపెనీ అతనికి జీరో డాట్ జీరో జీరో రూపాయలకి బిల్లు పంపింది. శకుంతల "చూశారా! మన బాకీ తీరిపోయిందన్న విషయం మా సుధాకర్ వాళ్ల ఫైనాన్స్ కంపెనీ ఎంత అందంగా తెలియజేసిందో!" అని ముచ్చటపడిపోయింది. ఓ వారం శేషగిరి ఆ కంపెనీకి ఉత్తరం రాసాడు.

"అయ్యా! మీ బాకీ తీరిపోయింది కనక హైపోథెకేషన్ కాన్సెల్ చెయ్యమని ఆర్.టి.ఓ. ఆఫీసుకు ఓ ఉత్తరం పంపండి" అంటూ.

దానికి జవాబు రాలేదు కాని, జీరో డాట్ జీరో జీరో రూపాయల



బిల్లు కట్టమని రిమైండర్ వచ్చింది. "జీరో డాట్ జీరో జీరో రూపాయల బిల్లేమిటి తమ మొహం" అని శేషగిరి జవాబు వ్రాసాడు శకుంతల వద్దంటున్నా.

దానికి జవాబుగా బిల్లు వెంటనే కట్టమని లీగల్ నోటీస్ వచ్చింది. శేషగిరికి ఒళ్లుమండింది. శకుంతలకి ప్రగతి పట్ల అనుమానం వచ్చింది మొదటిసారిగా. శేషగిరి ఆ ఫైనాన్స్‌కంపెనీలోనే సుధాకర్ పని చేస్తుండడంవల్ల అక్కడికి వెళ్లి పేట్రేగి పోయాడు. "మీకు చదువులు చెప్పిందెవరు? ఏ చెవులు తెగిన సంస్థ డిగ్రీలిచ్చింది? అంటూ. అతన్నిఅందరూ చేరి సుధాకర్ గదిలోకి అనునయిస్తూ తీసుకెళ్లారు. సుధాకర్. "రండి మామయ్యా!" అంటూ ఆదరంగా ఆహ్వానించాడు. వచ్చిన పని తెల్సుకొని, "వన్‌మినిట్" అంటూ టెర్మినల్ ముందు కూర్చుని కీ బోర్డుమీద వేళ్ల టకటకలాడించాడు. శేషగిరి కట్టాల్సిన సొమ్ము "జీరో డాట్ జీరో జీరో" రూపాయలని వచ్చిందిజ. "మీ బాకీ తీరిపోయింది. మీ కారు హపోథెటేషన్ కాన్సల్ చేయ్యమన్న లెటర్ ప్రింటవుట్ ఇస్తాను ఆగండి" అన్నాడు సుధాకర్. ప్రింటర్ విన లేదు. కమాండ్ తీసుకోలేదు. బాకీ కట్టి తీరాల్సిందేనని అప్పుడే తను చేస్తానని నిష్కర్షగా చెప్పేసింది. మాన్యువల్ ఓవర్‌రైడ్ తెలియలేదు.

సుధాకర్ స్వతహాగా తెలివైనవాడు. అతను వెంటనే "మావయ్యా! మీరు ఓ చెక్కు జీరో డాట్ జీరో జీరోకివ్వండి" అని అడిగాడు. శేషగిరి జీరో డాట్ జీరో జీరో రూపాయలకి చెక్కిచ్చాడు సమస్య తీరి సుధాకర్ కావల్సిన లెటరిచ్చాడు. మూడు రోజుల తరువాత శేషగిరి తన బాంక్‌కి వెళ్లి డబ్బు డ్రా చెయ్యబోయాడు. అక్కడి కంప్యూటర్ మీద ఇతని ఎకౌంట్ నంబర్ నొక్కగానే ఒకటే గందరగోళం / ? ! ఇల్లా అర్థం పర్థంలేని సంకేతాలు వచ్చి ఎర్రర్ చూపించింది. ఆ గుమాస్తా కంప్యూటర్ల విషయంలో బాగా తెలిసిన మరో అతన్ని పట్టుకువచ్చాడు. "మీరు జీరో డాట్ జీరో జీరోకి చెక్కిచ్చారు చూడండి, దానిని ఎల్లా ఎకౌంట్‌లోకి తీసుకోవాలో తెలియక కంప్యూటర్‌కి పిచ్చెక్కి క్రాష్ అయింది. ఆచెక్‌ని బౌన్స్ చేస్తున్నాను. ఈ దెబ్బతో మీ సమస్య తీరిపోతుంది." అని అతగాడా విధంగా శేషగిరి సమస్య తీర్చాడు. శేషగిరి డబ్బు డ్రా చేసాడు. శేషగిరి నిశ్చింతగా ఓ వారం రోజులున్నాడో లేదో "మీ చెక్ బౌన్స్ అయినందున మీ మీద చట్టబద్ధమైన చర్య మేమేల తీసుకొనరాదు?" అంటూ ఫైనాన్స్ కంపెనీ నుంచి ఓ నోటీసు వచ్చింది. శేషగిరి తలపట్టుకొన్నాడు.

(ఇది రచనలో నా రచన y z k కి సీక్వెల్‌గా భావిస్తున్నాను - రచయిత) ■